

# తూరుపు పొద్దు

**సి.ఎస్.రాంబాబు**

కొన్ని జ్ఞాపకాలు కొన్ని ప్రదేశాలతో ముడిపడి వుంటాయి. వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ కూడా దీనికి మినహాయింపు కాదు. జూబ్లీ బస్ స్టేషన్‌కి వెళ్లినప్పుడల్లా ఒక జ్ఞాపకం నన్ను వెంటాడుతూ వుండేది.

ఉద్యోగరీత్యా ఆదిలాబాద్‌లో రెండు సంవత్సరాలు ఉండాల్సివచ్చినప్పుడు ప్రతి ఆదివారం రాత్రి పది గంటలకు జూబ్లీ బస్‌స్టేషన్‌కు చేరుతూ వుండే వాడిని. ఇంచుమించుగా ఓ 40, 50 మంది ఇలా వారాంతానికి హైదరాబాద్‌కు వచ్చి వెళుతూ వుండేవాళ్లం. పిల్లలు హైదరాబాద్‌లో చదివితేనే అద్భుతంగా రాణిస్తారన్న భ్రమతో అందరమూ అక్కడ (పెళ్లైన) బ్రహ్మచారి జీవితాన్ని గడుపుతూ వుండేవాళ్లం. అయితే వీరిని గురించి కాదు నే మాట్లాడేది. జూబ్లీకి ఆదివారం రాత్రి వచ్చినప్పుడల్లా నా కళ్లు ఓ ఇద్దరికోసం వెతికేవి. వృద్ధాప్యం ఛాయలు అక్కడక్కడా కన్పించే ఈ 'ఇద్దరు మిత్రులు' అదే సమయంలో విజయవాడ బస్సు కోసం ఎదురు చూస్తూ వుండేవాళ్లు. వాళ్లిద్దరిలో ఒకాయన పచ్చగా, దబ్బ పండులా వుండేవాడు. మరొకాయన నల్లగా, చింతమానులా వుండే వాడు. అయితే ఆ దబ్బపండు మాత్రం ఇంగ్లీషులో



గడ, గడ మాట్లాడుతూ వుండేవాడు. అది కూడా 'గాంధీ' చిత్రంలోని పాత్రల్లా ఇంగ్లీషుని సొగసుగా, వ్యాకరణ దోషాలు లేకుండా మాట్లాడేవాడు. రెండో ఆయన మాత్రం తెలుగులో తెగ విసుక్కుంటూ వుండేవాడు. వీరి చికాకులు, కీచులాటలూ చాలమందికి విసుగుతెప్పిస్తూ వుండేవి. నాకు మాత్రం వీళ్ల సంభాషణ విచిత్రంగానూ ఆసక్తిగానూ వుంటూ వుండేది. వీరి సరదా కయ్యాలకు కారణం తెలుసుకోవాలనిపించేది. అప్పటికీ మధ్య తరగతి అభిజాత్యపు ముసుగు తొలగించి వారిని పలకరించే ప్రయత్నం కూడా చేశాను. చిత్రంగా ఇద్దరూ కూడా మా గొడవలో ఎందుకు తల దూరుస్తావు అన్నట్టుగా మొహాల్ని సీరియస్‌గా పెట్టేవాళ్లు. అప్పుడు నా అహం నాకు గుర్తుకొచ్చి నాలోకి నేను ముడుచుకు పోయేవాడ్ని. వీరిద్దరు ఇలా వుండటం వెనక వున్న కారణమేమిటో తెలుసు కోవాలన్న కుతూహలం మాత్రం నన్నొదలలేదు. ఉన్నట్టుండి ఒక ఆదివారం నుంచి నా మస్తిష్కాన్ని తొలిచేస్తున్న ఆ ఇద్దరు మిత్రులు జూబ్లీ బస్‌స్టేషన్‌లో కనిపించటం మానేశారు. ఈ విషయం గురించి మా వీకెండ్ బ్యాచ్ మిత్రుల్ని కదిపి చూశాను గానీ, అందరూ పెదవి విరిచిన వారే. కొంతమందయితే ''పోన్లెద్దురూ... బస్టాండులో బస్సుల రణగొణ ధ్వని ఇప్పుడు బాగా వినగలుగుతున్నాం'' అంటూ జోక్ చేశారు. నాకు మాత్రం గుడికెళ్లి దేవుడి దర్శనం చేసుకోకుండా తిరిగొచ్చేశామే అన్న భావన కలుగుతూ వుండేది. ఆ మిత్రులిద్దరూ లేక పోవటంతో సోడియం దీపాల ధగధగలన్నీ మసకబారినట్లనిపించేది. ఎప్పటికయినా ఆ మిత్రుల మిస్టరీని ఛేదించాలని వుండేది. ఆ తర్వాత ఆదిలాబాద్ నుంచి తిరిగి హైదరాబాద్‌కు బదిలీ అవ్వటంతో కొన్నాళ్ల పాటు నేను జూబ్లీబస్ స్టేషన్‌కు వెళ్లలేదు. నా కోరిక తీరలేదు.

***

చాలారోజుల తర్వాత విజయవాడ వెళ్లాల్సి వచ్చి మళ్లీ జూబ్లీ బస్‌స్టేషన్లో అడుగుపెట్టాను. ఒక్కసారిగా జ్ఞాపకాల పరిమళం నన్నల్లుకుంది. ప్రయాణీకుల హడావిడితో, బస్సు హారన్‌లతో బస్టాండ్ కొత్త కరెన్సీ నోటులా పెళపెళలాడుతోంది.

''ఎక్స్‌క్యూజ్ మీ... సీటు నంబర్ ఏడు, విండో సీటు నాది... కొంచెం పక్క సీటులో కూర్చుంటారా'' కటువుగా విన్పిస్తున్న ఆ గొంతు ఎక్కడో విన్నట్టుందే అని తలెత్తిచూశాను. ఆశ్చర్యం.... సంవత్సరం, సంవత్సరంన్నర క్రితం ఇదే జూబ్లీ బస్‌స్టేషన్‌లో ఎవరితోనయితే మాట్లాడదామని పరితపించానో ఆ జంటలో ఒకరు... అవును... ఆ విసుక్కునే వ్యక్తి. నేను ఆయన్ని గుర్తుపట్టాను కానీ, ఆయన నన్ను పట్టించుకోవటం లేదు. పోయినచోటే వెతుక్కోవటం అంటే ఇదేనేమో అన్పించింది.

బస్‌లో హడావిడి తగ్గి, డ్రైవర్ టికెట్లను చెక్‌చేసిన తర్వాత బస్ బయల్దేరు తుండగా అప్పుడు మాటలు కలిపాను.

''హలో అండీ... నా పేరు ప్రసాద్. ఒక ప్రభుత్వరంగ సంస్థలో పని చేస్తున్నాను. కొంతకాలం క్రితం మీరు మీ మిత్రుడితో ఇదే జూబ్లీ బస్ స్టేషన్‌లో కన్పిస్తూ వుండేవారు. సరిగ్గా చెప్పాలంటే ప్రతి ఆదివారం ఇదే సమయానికి మీ ఇద్దరి కీచులాటలతో చాలామందికి విసుగ్గా ఉండేది కానీ, నాకు మాత్రం ఏదో కారణం వుండే వుంటుందనిపించేది, తీరా మీరు ఆసక్తి చూపకపోయినా మీతో మాట్లాడాలి అని గట్టిగా నిర్ణయించు కునే సరికి మీరిద్దరూ ఆదివారాల్లో జూబ్లీకి రావటం మానేశారు. మీతో మాట్లాడి మీ 'మిస్టరీ హిస్టరీ' తెలుసుకుందామనే కోరిక అలానే మిగిలి పోతుందనుకున్నాను. కానీ ఈ రోజు అదృష్టం ఇలా తిరగబడుతుందను కోలేదు'' ఇలా ఆనందంలో అర్థం, పర్థం లేకుండా మాట్లాడేశాను. నా అంత ఉత్సాహంగా తిరిగి ఆయన మాట్లాడలేదు.

''అదంతా గతం బాబూ, దాన్ని తవ్వుకోవటం ఎందుకు'' నిర్లిప్తంగా అన్నాడు.

''కనీసం మీ పేరు, దడ పుట్టేలా ఆంగ్లంలో గడ, గడ మాట్లాడే మీ మిత్రుడి పేరూ అయినా చెప్పండి'' ఉత్సాహం ఆవిరవుతుండగా అన్నాన్నేను.

బస్సు దిల్‌సుఖ్‌నగర్ దాటింది. చీకట్లను చీల్చుకుంటూ చలిగాలులు మొహాల్ని తాకుతున్నాయి. చలిగాలిని అడ్డుకోవటానికి కిటికీని మూస్తూ చీకటిలో మొదలు పెట్టాడాయన.

''నా పేరు రామారావ్... మీరు చెప్పిన ఇంగ్లీష్ వ్యక్తి నా బాల్యమిత్రుడు పటేల్. మీరన్నట్టు అలా ప్రతి ఆదివారం మేము పోట్లాడుకున్నట్టుగా చాలామందికి అనిపించటంలో ఆశ్చర్యంలేదు కానీ... దాని వెనకో బరువైన నేపథ్యం వుంది''.

చీకట్లో ఆయన వేడి నిట్టూర్పు సెగ తగలింది నాకు.

''భలే వారే... తిరిగి మిమ్మల్ని ఇలా కలవటం నాకింకా కలలానే వుంది''.

నేనన్న మాటలకు ఓ చిత్రమైన నవ్వు నవ్వి తన జ్ఞాపకాల పొరలను ఒకటొకటే వలిచే ప్రయత్నం చేశాడాయన.

''మా ఇద్దరిదీ బెజవాడ... అదే విజయవాడ దగ్గర్లో వున్న ఓ పల్లెటూరు. అన్నట్టు నా మిత్రుడి పేరు పటేల్. వాళ్ల తాత ముత్తాతలు ఎక్కడో గుజరాత్ నుంచి వచ్చి మా ఊళ్లో స్థిరపడిపోయారు. ఇద్దరం ఒకేసారి వూళ్లోని బళ్లో చేరాం. అప్పట్లో నాల్గో తరగతిలో కానీ ఎబిసిడిలు నేర్పించే వారు కాదు. పటేల్‌కు మాత్రం ఒకటో తరగతి నుంచి ఇంగ్లీష్ పట్ల విపరీతమైన వ్యామోహం ఉండేది. అర్థం కాకపోయినా పెద్దపెద్ద ఇంగ్లీష్ అక్షరాలు, బొమ్మలు వున్న పుస్తకాలు బడికి తెచ్చేవాడు. వీడి పోరు భరించలేక వాళ్ల నాన్న అవన్నీ బెజవాడ నుంచి కొని తెస్తూ వుండే వాడు. మేము నాలుగో తరగతికి వచ్చేటప్పటికీ వాడికి ఎబిసిడిల బడులన్నీ వచ్చు. తరగతి పెరుగుతున్న కొద్ది వాడి ఇంగ్లీష్ పరిజ్ఞానం కూడా విపరీతంగా పెరుగుతూ వుండేది. వీడికున్న పిచ్చికి మాస్టర్లే ఆశ్చర్యపోతూ వుండే వాళ్లు. ఒకసారి 9వ తరగతి చదువుతున్నప్పుడు అనుకుంటా... ఇంగ్లీష్ మాస్టారు శంకరంగారు ఓ ప్రశ్న అడిగారు. అదిప్పటికీ నాకు గుర్తే.

''ఒరేయ్ పిల్లలూ.... ఇవ్వాళ మీ ఆంగ్ల భాషా పరిజ్ఞానానికో పరీక్ష పెట్టాలనుకుంటున్నాను... ఏమంటారు?''

''ఓ తప్పకుండా మాస్టారూ...'' కోరస్‌గా అరిచారు పిల్లలంతా.

''మిమ్మల్నో ఇంగ్లీష్ మాటకు అర్థం అడుగు

## గాయత్రి మంత్రార్థం తెలియజేయండి?

తుర్లపాటి వైదేహి, విజయవాడ

**సత్‌సాంగత్యంవల్ల ఏదైనా పుణ్యం లభిస్తుందా?**

సమాజంలో వివేకవంతులెపుడూ సత్‌సాంగత్యాన్నే ఆశిస్తారు. ధర్మనిష్ఠాపరులైన సమాజ హితులు అందరిలోనూ ఆ చైతన్యం నింపేందుకు నడుం కడతారు. 'దుష్టులకు దూరంగా ఉండమని' నీతి సూక్తులేనాడో ఉద్బోధ చేశాయి. సత్ సాంగత్యం వల్ల జీవితం సుఖ సంతోషాలకు నిలయమవుతుంది. లోకమంతా ధర్మపరాయణులైననాడు పాడి పంటలకు నీతి నిజాయితీలకు కొదవుండదు. ఇందుకు మహాభారతంలోని ఒక ఘట్టాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. విరటుని కొలువులో ఉన్న పాండవుల జాడ కనిపెట్టి వారి అజ్ఞాతవాసాన్ని భంగపరిచేందుకు కురురాజు అనేక ప్రయత్నాలు చేస్తాడు. కానీ ఆ యత్నం చివరి వరకు సఫలం కాలేదు. ధర్మపరాయణులెక్కడ ఉంటారో ఆ ప్రాంతం భోగభాగ్యాలతో, పాడిపంటలతో పచ్చగా అలరారుతూ ఉంటుందని, అందువల్ల అఖండ భూ మండలంలో

## సందేహాలు - సమాధానాలు

పాండవులున్న ప్రదేశాన్ని కనుగొనడం ధర్మపరులకు అత్యంత సులభమని శ్రీకృష్ణుడు ఒక సందర్భంలో అభిమన్యునికి సెలవిస్తాడు. సత్ సాంగత్యం వల్ల అంతటి పుణ్యం సమకూరుతుంది.

కిషోర్ గంగాధర, నెల్లూరు

**గాయత్రి మంత్రార్థం తెలియజేయండి?**

'సర్వరక్షకుడవైన నీవు బ్రహ్మాండమంతా వ్యాపించి ఉన్నావు. సర్వ పాప వినాశకమైన నీ తేజస్సును ధ్యానిస్తాం. నీవు మా బుద్ధి కర్మలయందుండి మంచి ప్రేరణ కలిగించి, మమ్మలను ఉత్తమ మార్గాన నడిపించెదవు గాక!' అన్నదే గాయత్రీ మంత్రార్థం.జగద్గురు ఆది శంకరాచార్యులవారు కూడా దీనికి భాష్యం చెప్పారు. సర్వ దేవాత్మకుడు, సర్వశక్తిమంతుడైన సర్వాత్మకుని సకల వేద సారంగా ఆయన గాయత్రీ మంత్రాన్ని అభివర్ణించారు. రుగ్వేదం మూడవ మండలం 62వ సూక్తంలోని పదవ మంత్రం గాయత్రీ దివ్య మంత్రం. 'భూ మండలంపై సకల కార్యాలకు ప్రేరకుడైన సూర్య భగవానుడు సృష్టికర్త. ప్రత్యక్ష దేవత. సర్వసాక్షి. ఆయన్ను పూజించి భజిస్తాం, మనుసులో నిలుపుకుంటాం' అనేది సాయణ వ్యాఖ్యానం.

ఎం.విశ్వం, పెదనింద్రకొలను.(ప.గో.జిల్లా)

**షడ్రుచులంటే ఏవి?**

సాధారణంగా షడ్రుచులని చదవడం వినడమే గాని వాటి గురించి చాలా మందికి తెలియదు. అన్నీ అందరికీ పూర్తిగా తెలియవు. జిహ్వ చాపల్యం ఉన్న ఆరోగ్యవంతులు ఆహారంలో ఆరు రుచులు ఉండేట్టు చూసుకుంటారు. మధురిమ, పులుపు, లవణం, కారం, చేదు, వగరులనే షడ్రుచులంటారు.

కె.పోసిబాబు, రావులపాలెం

**రుద్రాక్షలకున్న మహిమ ఏమిటో తెలియజేయగలరు?**

రుద్రాక్షమాలలు అందరూ మెడలో ధరించవచ్చు. దీనికి ఎలాంటి స్త్రీపురుష వయోభేదాలు, కుల భేదాలు లేవు. యజ్ఞోపవీతం ఎంతటి పవిత్రమైనదో రుద్రాక్ష కూడా అంత మహిమాన్వితమైనది. దురాచారులు, సత్‌ప్రవర్తనలేనివారు ధరిస్తే సన్మార్గంలోకి వస్తారు. నిత్యజీవనంలో ఇది అండగా ఉంటుంది. ముహూర్తాలు, నక్షత్రాలకు అతీతంగా ఎప్పుడైనా వీటిని ధరించవచ్చు. పంచముఖి, సప్తముఖ అనే ఎలాంటి భేదాలు పాటించనవసరం లేదు. ఎవరైనా రుద్రాక్ష ధరించవచ్చు. రుద్రాక్షలను మానవ నైపుణ్యంతో పలు ముఖాలుగా చెక్కుతారు. దానికి పట్టింపులేదు. రుద్రాక్షను వేలి ఉంగరాల్లో ధరించడం నిషిద్ధం. సంపర్క సమయంలో వీటిని ధరించరాదు. ఒకరి మాల మరొకరు ధరించరాదు.

గోవిందరాజులు, మౌలాలి.

**పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల కలిగే పుణ్యాన్ని తెలియజేయండి?**

పుణ్యక్షేత్ర దర్శనం పూర్వజన్మ సుకృతం. పాపవిమోచనం అన్నారు. కేవలం పుణ్యక్షేత్రాలను దర్శించినంత మాత్రాన సరిపోదు. ఆ పుణ్యక్షేత్ర మహిమను కూడా శ్రవణం చేయాలి. ఈ పుణ్యక్షేత్ర మహిమను పదిమందికీ ప్రచారం చేయాలి. అప్పుడే పుణ్యఫలం ఇనుమడిస్తుంది. పుణ్యక్షేత్ర దర్శనం, ఇష్టదైవాన్ని సేవించుకోవడం, పుణ్యజలాల్లో స్నానమాచరించడాన్ని మించింది మరోటిలేదు.

**మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి**

**సందేహాలు-సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500033**

తాను... మీరు చెప్పాలి'' పిల్లలంతా నిశ్శబ్దమయిపోయారు. అందరి మొహాల్లోనూ టెన్షన్.

"TEETOTALLER (టీటోటలర్) అనే మాటకు అర్థమేమిటి? మీరు గనక టెక్ట్స్ బుక్ చదివే వాళ్లయితే వెంటనే చెప్పేస్తారు'' మాస్టారో చిన్న క్లూ ఇచ్చారు.

''ఒరేయ్ రవీ, నువ్వు చెప్పరా... నువ్వెలాగూ క్లాస్ ఫస్ట్ కదా''

***

''ఏరా మాట్లాడవు? నువ్వే చెప్పలేకపోతే ఇక వీళ్ళేం చెబుతారు'' శంకరం మాస్టారి గొంతులో నిరుత్సాహం తెలుస్తూనే వుంది.

''మాస్టారూ... నన్ను చెప్పమంటారా...'' ఎప్పుడూ దేనికి లేవని పటేల్ అప్పుడు లేచాడు.

''నువ్వా'' మాస్టారి మొహంలో ఆశ్చర్యంతో కూడిన సందేహం.

''సరే చెప్పు.....'' అయిష్టంగానే అవకాశమిచ్చారు.

''దానర్థం... మద్యం ముట్టనివాడని సార్...''

''వెరీగుడ్... ఇంతకీ దానర్థం ఎలా తెలుసుకున్నావో అందరికి చెప్పు'' మాస్టారు మెచ్చుకోలుగా అన్నారు.

''మా నాన్ననడిగి పాత డిక్షనరీని కొనిపించుకున్నాను సార్... రోజూ అందులోంచి అర్థాలు చదువుకోవడం నాకిష్టం సార్....''

''చూశ్శారా పిల్లలూ... మీరు కూడా పటేల్‌లా ఇంగ్లీష్ అంటే భయపడకుండా చదివారంటే అది మీకు మంచి నేస్తమయి కూర్చుంటుంది''.

మాస్టారి మాటలకు పటేల్‌ని అభినందిస్తూ చప్పట్లు మారుమ్రోగాయి.

ఆ రోజును ఎంతో ఆర్ద్రంగా గుర్తు చేసుకున్నారు రామారావ్ గారు. వింటూ వుంటే నాకదంతా తమాషాగా అన్పించింది.

''బహుశా పటేల్‌కు ఇంగ్లీష్‌తో ఆ బంధం, ఈ బంధం ఎంతో దృఢమైనది అన్నట్లు సాగి వుండాలి అవునా'' విజయం సాధించినట్లుగా అడిగాను.

''అవును... ఆ రోజు నుంచి మాస్టారు, పటేల్ మంచి మిత్రులయిపోయారు. అంతేకాదు పటేల్ ఇంగ్లీష్ క్లాసిక్స్ తెచ్చి మాకు చూపిస్తూ వుండేవాడు. ఇంగ్లీషు సినిమాల పోస్టర్లు కన్పిస్తే చాలు కళ్లప్పగించేసే వాడు. ఆ రోజుల్లో బెజవాడ లీలా మహల్, నవరంగ్ థియేటర్లలో ఇంగ్లీష్ సినిమాలు బాగా ఆడుతూ వుండేవి. నేను, వాడు దొంగతనంగా విజయవాడ వచ్చి ఆ సినిమాలను చూసే వాళ్లం. ఆ సినిమాల్లోని నటులను అనుకరిస్తూ డైలాగులు చెప్పటం వాడికిష్టమయిన కార్యక్రమం. అయితే వాడు ఇలా చేస్తాడన్నది నాలాంటి ఒకరిద్దరి మాత్రమే తెలుసు. నలుపు, తెలుపు నుంచి రంగుల్లోకి మారుతున్న వాడి జీవిత చిత్రంలో ఇంటర్వెల్‌కు ముందు

వచ్చే కథను మలుపు తిప్పేలాంటి దృశ్యం వాడి జీవితాన్నే మార్చేసింది.

''కొంచెం అర్థమయ్యేలా చెప్పండి...'' ఆయన కున్న సినిమా పిచ్చి మీద అసహనాన్ని ప్రదర్శిస్తూ ''ఉన్నట్టుండి పటేల్ వాళ్ల నాన్నగారు గుండె పోటుతో పోయారు. దాంతోటి కుటుంబ పోషణ అంతా వాడి మీద పడింది. నేనేమో డిగ్రీ తరువాత గ్రూప్ -2 సర్వీస్‌లో విజయం సాధించి స్టేట్ సర్వీసెస్‌లో చేరిపోయాను''.

''అంటే మీ ఇద్దరి మధ్య కొంతకాలం దూరం ఏర్పడిందా''.

ఆయన సమాధానం ఇచ్చేలోపే సూర్యాపేట వచ్చిందన్నట్లు బస్సులో లైట్లు వెలిగాయి. ఆ ఇద్దరి మిత్రుల జ్ఞాపకాల పరిమళం నాలో వ్యాపిస్తూ ఉంటే, ఆ పరిమళాలను వేడి టీతో ఆస్వాదిస్తూ, ఇద్దరం సిగరెట్లు వెలిగించాం. బస్టాండ్‌లో జనం పల్చగా వున్నారు. ఎప్పుడూ ఘుమ ఘుమలతో కళకళలాడుతుండే పాప్‌కార్న్ మెషీన్ నడి రాత్రిలో ఉదయం తాలూకు జ్ఞాపకంలా వుంది. అప్పుడప్పుడు వచ్చే బస్సుల కోసం ఆటోలు ఆవలిస్తూ నిలుచుని వున్నాయి. ''రావాలిసార్'' డ్రైవర్ బయట నిలబడ్డ పాసెంజర్లను పిలుస్తుండడంతో క్రమశిక్షణతో స్కూలు బస్సు ఎక్కే విద్యార్థుల్లా ప్రయాణీకులు క్యూ కట్టారు. పౌర్ణమి తరువాతి రోజు కూడా చంద్రుడు అంతే ఆహ్లాదంగా వెండి వెన్నెలతో మురిపిస్తుంటే వాహనాలన్నీ ఆనందంతో తడిసి ముద్దవుతున్నాయి. మళ్లీ ప్రయాణీకులందరూ నిద్రలోకి జారుకుంటున్నారు. వెన్నెల జల్లులో మరొక సెషన్‌కు సిద్ధమయ్యాం మేమిద్దరమూ. మా సంభాషణలో వచ్చిన విరామం లానే వారిద్దరి మధ్య వచ్చిన విరామం గురించి ప్రస్తావించాను.

''లేదు లేదు... వాడు వ్యవసాయం చేస్తూనే ఇంగ్లీష్ క్లాసిక్స్‌నూ, ఇంగ్లీష్ సినిమాలనూ వదలనట్లే నేనూ వాడిని వదల్లేదు. మాకూ కొంత భూమి ఉండటంతో మా నాన్నగారు ఆయన చివ్రరోజుల వరకూ వ్యవసాయం చేస్తూనే వుండేవారు. అయితే పటేల్‌కు సాహిత్య ప్రభావం వల్లనేమో లండన్, వాషింగ్టన్, పారిస్ లాంటి నగరాలు వెళ్లాలని తెగ తాపత్రయ పడుతూ వుండేవాడు. వాడికున్న కుటుంబ బాధ్యతలు వాడికి ఆ అవకాశం ఇవ్వలేదు. ఈ రోజుకి నాకు ఇంగ్లీషు సినిమాల్లో డైలాగులు అర్థం కావు. వాడు మాత్రం గ్రెగరీపెక్ ఇలా చెబుతాడు, మైకేల్‌కేన్ స్టైలు ఇది, మైకేల్ డగ్లస్ మాట ఇలా వుంటుంది. ఎలిజబెత్ టేలర్ పలుకు ఇది అంటూ పర్‌ఫెక్ట్‌గా ఆ రోజుల్లోనే చెబుతూ వుండేవాడు.

''అర్ధరాత్రి మాకీ కామెంటరీ ఏమిటిసార్'' ముందు సీటు ప్రయాణీకుడు రుసరుసలాడుతున్నాడు.

''సారీ... నెమ్మదిగా మాట్లాడుకుంటాం''.

''గురూజీ... కిటికీ పూర్తిగా తీయకండి.... చలి చంపేస్తోంది...'' వెనకసీటు ప్రయాణీకుడు వేదన

''వెన్నెల కవ్వించటం లేదా...'' గొణిగాను.

''మనం విజయవాడ చేరేలోపు ఇద్దరు మిత్రుల కథ క్లైమాక్సుకి చేరుతుందా'' కిటికీని కొంచెం మూసేస్తూ అడిగాను.

''సారీ మీకు బోర్ కొట్టిస్తున్నానేమో... ఇద్దరమూ సంసార సాగరంలో పడిన తర్వాత కూడా పటేల్‌కి ఇంగ్లీష్ మత్తు వదల్లేదు. తను చేయలేనిది కొడుకు పూర్తి చేయాలని ఆశించాడు''.

''ఇది ఏ తండ్రయినా అనుకుంటాడు. అదేగదా. ఇప్పటి పిల్లలకు తల్లిదండ్రులతో వున్న పెద్ద సమస్య'' ఏదో సత్యాన్ని ఆవిష్కరించినట్లుగా ఫోజు పెడుతూ అన్నాను.

''మీరు వూహించింది నిజమే. అక్కడే పటేల్ దెబ్బతిన్నాడు''.

''అంటే మీ పటేల్ కొడుకు ఏ వాషింగ్టనో, లండనో వెళ్లాలని కలలు కన్నాడు.

అది జరగలేదు. దాంతో దెబ్బతిన్న పులయిపోయి వుంటాడు. అంతేనా? మళ్ళీ మరొక ఫోజు పెడుతూ అడిగాను.

''కొడుకు లండన్ వెళ్లాలనుకున్నాడు. అది నిజమే. అది జరగలేదని మీరూహించింది తప్పు''.

''మరి సమస్య ఏమిటి...'' ఈసారి దెబ్బతిన్న పులిని నేనయ్యాను.

''వాళ్ల నాన్నలాగా ఇంగ్లీష్ క్లాసిక్స్ చదవకపోయినా, నాన్న కోరుకున్నట్లు వాషింగ్టన్ వెళ్లాలని ఆ కుర్రాడు కష్టపడ్డాడు. అనుకున్నది సాధించాడు''.

''ఇక సమస్య ఏముంది... మీ పటేల్, వాళ్లావిడ కొడుకు దగ్గరకు వెళితే సరిపోయేది కదా'' సహేతుకంగా మాట్లాడాననుకున్నాను.

''సమస్యంతా అక్కడే వచ్చింది. పటేల్ భార్య ఎట్టి పరిస్థితుల్లోనూ వూరు వదలిరానని చెప్పింది. భార్యను ఒప్పించలేడు. కొడుకుని నొప్పించలేడు. ఇదీ వాడి పరిస్థితి. చివరకి అయిష్టంగా కొడుకు బలవంతం మేరకు వాషింగ్టన్ వెళ్లాడు''.

''ఆ తర్వాత ఏం జరిగింది''. ఈసారి ఉత్సుకతతో అడిగాను.

''ఎక్కడికయితే తను వెళ్లాలని కలలు కన్నాడో, అక్కడికి వెళ్లిన తర్వాత పటేల్ ఎందుకో బాగా నిరుత్సాహపడ్డాడు. తనూహించింది వేరు. అక్కడ కన్పించింది వేరు''.

''అంటే'' సందేహంగా అడిగాను.

''పటేల్ ఇంగ్లీష్ క్లాసిక్స్ చదివి, ఇంగ్లీష్ సినిమాలు చూసి ఆ వాతావరణాన్ని మరోలా ఊహించుకున్నాడు. అప్పటివరకు ఆ ప్రదేశాల గురించి ఒక స్వప్న ప్రపంచంలో విహరించాడు. అక్కడకు వెళితే స్వప్న ప్రపంచాన్ని స్వయంగా దర్శించిన అనుభూతి మిగులుతుందనుకున్నాడు. వాస్తవం ఎందుకో అతనికి విరుద్ధంగా కన్పించింది. అది అతనిలో మానసిక ఘర్షణకు దారితీసింది. ఆ ఘర్షణలోంచే అతని వివేచన కళ్లకు కమ్మిన పొరలను సమూలంగా తుడిచేసింది. ఇంగ్లీషు భాషలోని సౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని ప్రేమించాడు కానీ, ఆ భాష మాట్లాడే ప్రాంతాన్ని, అక్కడి ప్రజలను కాదని తెలుసుకున్నాడు. ఆ ప్రాంతం, మనుషులతో పోలిస్తే తన నేల, తన మనుషులు వారి ఆత్మీయతలే గొప్పవని గ్రహించాడు పటేల్''.

''ఇవన్నీ మీకెలా తెలుసు. ఇంత ఖచ్చితంగా చెబుతున్నారు'' అయోమయంగా అడిగాను.

''ఇక్కడ్నించి వెళ్లిన నెలరోజులకే తిరిగొచ్చే

ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040-23747777 , 9391999999



FREE online Registration &
Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

అమీర్‌పేట్ నెల్లూరు
కూకట్‌పల్లి తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ కర్నూలు
విజయవాడ (చెన్నయ్) టి.నగర్
గుంటూరు బెంగుళూర్
తెనాలి సేలం
విశాఖపట్నం మధురై
రాజమండ్రి వెల్లూరు
కాకినాడ తిరుచి
ఖమ్మం పాండిచ్చేరి
ఒంగోలు ఈరోడ్
ఏలూరు
చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

శాడు పటేల్. కొడుకుని, కోడలుని కూడా వెనక్కి వచ్చేయమన్నాడు. పరాయిదేశం వెళ్లమన్నది నువ్వు. అందుకు నన్ను మానసికంగా సిద్ధం చేసి ఇప్పుడు వచ్చేయమంటే ఎలా నాన్నా... నా వల్ల కాదు అన్నాడు ఆ కొడుకు. అది పటేల్‌కు తగిలిన మొదటి దెబ్బ''.

అప్పటికి దాకా నాలో వున్న నవ్వు రెక్కలొచ్చి ఎగిరిపోయింది. విదేశాలలో పిల్లలున్న ప్రతి తల్లి, తండ్రి అనుభవించే క్షోభ ఇది అని మనసులో అనుకున్నాను.


''నిజమే... ఇంతకు మించిన దెబ్బేముంటుంది'' బాధగా అన్నాను.

''పటేల్ తిరిగి వచ్చినా కూడా, కొడుకు రానని చెప్పినందుకో ఏమో పటేల్ భార్య ఆరోగ్యం దెబ్బతిన్నది. కొడుకుని కలవరిస్తూనే పైలోకాలకు వెళ్లిపోయింది ఆ ఇల్లాలు. తల్లి ఆఖరి చూపులు దక్కించుకోవటానికి ఆ కొడుక్కి అమెరికా ఆర్థిక మాంద్యం దెబ్బ తగిలింది. ఇప్పుడు ఇంటికి వస్తే తిరిగి వెనక్కి వెళ్లటం కష్టమని తెలిసి, తండ్రికి నేను తర్వాత వస్తాను. ఈలోగా అన్ని కార్యక్రమాలు జరిపించండని డబ్బులు పంపించి వూరు కున్నాడు. ఇది పటేల్‌ని బాగా కుంగదీసింది. కొడుకు ఈ విధంగా తయారవ్వటానికి కారణం తన ఇంగ్లీష్ పిచ్చేనన్న అపరాధ భావనతో విలవిల్లాడిపోయాడు. నాతో చెప్పుకుని కళ్లమ్మట నీళ్లు పెట్టుకునేవాడు. రిటైరయిన తర్వాత చిన్ననాటి స్నేహితుడి తోడు వుంటుందని నేను మా వూరొచ్చేశాను. వచ్చిన కొద్ది నెలలకే జరిగిన ఈ పరిణామాలన్నీ నన్నూ బాధ పెట్టాయి. కొంచెం గాలి మార్పు ఇద్దరికీ అవసరం అన్పించింది. అందుకే వారానికొకసారి హైదరాబాద్‌కు వచ్చి, అక్కడున్న వృద్ధాశ్రమాలకు వెళ్లి మాలాంటివారిని పలకరించి, ఎంతో కొంత సాయం చేసి వూరట కలిగిద్దామని వాడిని ఒప్పించి శని, ఆదివారాలు వస్తూండే వాళ్లం. బహుశా అప్పుడే మమ్మల్ని మీరు చూసి వుంటారు''.

''సారీ అండీ... మీ ఇద్దరి స్నేహం ఇంత విడదీయరానిదని నాకు తెలీదు. మీరేదో వారిని అనవసరంగా బాధపెడుతున్నారని నాకు చాలా కోపంగా వుండేది. మిమ్మల్ని అపార్థం చేసుకున్నందుకు నన్ను క్షమించండి'' మనస్ఫూర్తిగా వచ్చాయి ఆ మాటలు నా నోటి నుంచి.

''లేదు ప్రసాద్ గారూ... అందులో మీ తప్పేమీలేదు. నువ్వు నన్ను అందరి ముందు అవమానకరంగా మాట్లాడితేనే నాకు నిష్కృతి. అప్పుడే ప్రతివారం వస్తానని నా దగ్గర వాడు మాట తీసుకున్నాడు. లోపల నేనెంత బాధపడేవాడినో మీకు తెలీదు. ఎందుకురా ఇది అంటే నాకు నేను వేసుకున్న శిక్ష ఇది అనేవాడు.''

తెలతెలవారుతోంది. పక్షుల కిలాకిలారావాలు ఒక గొప్ప సితార్ వాద్య కళాకారుడులా లయబద్ధంగా అందరిని మేల్కొలుపుతున్నాయి. పంట పొలాల మీంచి వచ్చే సన్ననిగాలి రాత్రి బద్ధకాన్ని చెరిపేస్తోంది. కనుచూపు మేరలో కొండల మీద పేర్చినట్టున్న అగ్గిపెట్టెలాంటి ఇళ్లు, పచ్చటి కేన్వాస్ మీద ఒక నైపుణ్యంగల చిత్రకారుడి కుంచె గీతల్లా సుతారంగా దర్శనమిస్తున్నాయి. విజయవాడ పొలిమేరల్లోకి వచ్చేశామన్నట్టు చుట్టూ కోలాహలు, రణగొణధ్వనులు మొదలయ్యాయి.



తూరుపు తొలిపొద్దు సమస్త ప్రకృతికీ శుభోదయం పలుకుతోంది. తూరుపు పొద్దు నుంచి పడమటి సంధ్యను చూసినప్పుడు, అది కోటి రాగాల స్వరరాగ రంజితం అని భ్రమించాడు పటేల్. దగ్గరకు వెళ్లేసరికి అవి సంజె చీకట్లే కానీ, వెలుగు వాకిళ్లు కావని అర్థమయిందా పటేల్‌కి? ఏమో సమాధానం లేని ప్రశ్నే ఇది అనిపించింది ఆ క్షణాన నాకు.

''మిమ్మల్నొకటడగొచ్చా'' సంశయంగా అన్నాను.

''మీ ఇద్దరితో కలిసి కూర్చుని కాఫీ తాగొచ్చా''

ఈసారి రామారావు గారి నుంచి సమాధానం రాలేదు. ఆయన కళ్లలో తడి మాత్రం మెరుస్తూ కన్పించింది.

పొరపాటు ప్రశ్న వేశానని నా కర్థమయింది. బరువెక్కిన గుండెలతో బాధగా అన్నాను.

''అది జరిగి ఎంతకాలమయింది''.

''వాడు లేకుండా నేను ఒక్కడ్నే హైదరాబాద్‌కు రాలేక పోయాను''.

***

''మీరు చూసిందే ఆఖరు. చివరకు కొడుకు రాలేదన్న దుఃఖంతోనే కన్ను మూశాడు''

''నాకో అవకాశమిస్తారా''

***

''మీతోపాటు మీ వూరొచ్చి ఈ రోజంతా మీ ఇద్దరి జ్ఞాపకాలతో నన్ను నేను కప్పేసుకోవచ్చా''.

పెల్లుబికిన కన్నీటితో, బాధతో గొంతు మూగపోయిన రామారావుని అనునయంగా దగ్గరకు తీసుకున్నాను. వారిద్దరి స్నేహబంధాన్ని ఆప్యాయంగా తడిమాను.

✱

రచయిత సెల్ నెం: 94904 01005

కవిత poem

## తెగిపోయిన పూల ఊయల

చీకటి మబ్బు తెరల్ని చీల్చి ఒక కోయిల సూర్యున్ని నిద్ర లేపినట్టు
నిలబడి వున్న పూలవనానికి కొత్త నడక నేర్పినట్టు
ప్రార్థనలో నిలబడి నువు 'నేటి సూక్తి'ని చదివేదానివి గదా!
లేలేత మెదళ్ళను పదునుబెట్టే ప్రశ్నలేవో అడిగే దానివి గదా!
అంతలోనే అసంపూర్తిగా పుస్తకాలను వదిలి
ఎక్కడికమ్మా మరో పూర్ణమ్మవై పోయినవు!
ఎందుకమ్మా దుఃఖపు కొలనులో దూకినవు!!
నిండు అమాసనాడు పుట్టిన ఆడిబిడ్డోలె వుండేదానివి
పరిమళాలు వెదజల్లే మల్లెల నవ్వోలె వుండే దానివి
బాల్యపు అద్దంలో జాబిలిని చూసి ఆనందించే సమయాన
కరెన్సీ కత్తులు తెంపిన సీతాకోక చిలుక రెక్కలు నీవి!
ఊరు మునుగుతూ, మునుగుతూ
నల్లకలువ వంటి నీ జీవితాన్నే ముంచెగదమ్మా!
బడి మైదానంలో నువాడాల్సిన ఆటలింకా మిగిలి వున్నాయి
పాఠశాల వేదిక మీద నువు పాడాల్సిన పాటలు మిగిలేవున్నాయి
అనాదిగా కుటుంబం-గుడి కలసి బడిని ఓడిస్తూనే వున్నాయి
ఇపుడు బతుకు మీద రూపాయే గెలుస్తున్నది!
నీచ సంప్రదాయాల సాక్షిగా నీ ముందు అక్షరాలు తలొంచుకున్నాయి.
ఆఖరిసారి నీతో గడపను కడిగించి ముగ్గేయించి
నిను ఇంటి వాకిలి దాటించి వాళ్ళు చేతులు దులుపుకున్నారు
హోం వర్కు చేసుకొని రమ్మన్న మాదిరి సమస్యలకే
భయపడ్డ సుకుమారపు నీ మనసు
బండెడు ఇంటి సమస్యల నెట్ల సాధిస్తుందమ్మా!
ఏ నిఘా విభాగము నిను కనిపెట్టలేదు!
ఏ నాలుగో ఎస్టేట్ నీ వైపు చూడలేదు!!
ఏ చట్టము నీకు రక్షణగా లేదు
క్షమించమ్మా! క్షమించు!!
నిను సమ్మక్కను చేయనందుకు!
రాణి రుద్రమను చేయనందుకు
(బాల్య వివాహాలకు చలిస్తూ....)

-తైదల అంజయ్య

సెల్: 98668 62983